# త్యాగభావమును పెంపొందించుకోండి

మౌళి గుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుంపెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
డంబైన ఫాలనేత్రంబుతోడ
నల్ల నేరెడువంటి నల్లని మెడతోడ
కరమున నాగ కంకణముతోడ
నడుమున చుట్టిన నాగచర్మముతోడ
మైనిండనలదు భస్మంబుతోడ
నుదుట దీర్చిన పెద్ద కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబుతోడ
ఆరుశాస్త్రములందున నందగించి
నల్ల కలువల హాసియించి కొల్లలాడు
మెరుగు చామన ఛాయల మేనితోడ
కైలాసవాసుడు ప్రత్యక్షమాయె కనుల ఎదుట

ప్రేమస్వరూపులారా! ఈ దసరా ఉత్సవాల సందర్భంగా ప్రతి దినము ఈశ్వరత్వమును గురించి అనేకమంది అనేక విధములుగా తెలుపుతూ వచ్చారు. ఈశ్వరుడనగా కేవలము జడలతో, పాములతో అలంకరించుకొని వస్తుంటాడని సామాన్యంగా అందరి నమ్మకం. ఇది కాదు ఈశ్వరుని స్వరూపం. ఈశ్వరుని సహజమైన స్వరూపము సర్వత్రా వ్యాపించినప్పటికీ భక్తులు తమతమ భ్రమలచేత ఈరకమైన రూపవర్ణన చేస్తూ వచ్చారు. భారతీయుల యొక్క బలహీనత ఈరకంగా ఉంటున్నది. తాము తలంచిన దైవస్వరూపాలు కూడను దేవతా విగ్రహాలు కూడను కేవలము ఒకవిధమైన భిక్షగాండ్రుగా భావిస్తున్నారు.

srisathyasaivachanamrutam

**భారతదేశము బీదదేశము కానే కాదు**

నిజముగా విచారించి చూచిన భారతదేశములో ఎవ్వరూ భిక్షగాళ్ళే లేరు. ఉండుటకు వీలులేదు. ప్రతి వ్యక్తినీ, తమ కంటే చిన్నవారని, తమకంటే తక్కువవారని కొందరు భావిస్తుంటారు. ఇది కేవలము వారి బలహీనత మాత్రమే. ప్రజలలో ఈవిధమైన భావము ప్రబలి ఉండడంచేత భారతదేశము చాలా బీదదేశమని, ఈ దేశములో అందరూ భిక్షగాళ్ళే ఉంటారని భావిస్తూ వచ్చారు పర దేశీయులు. ఇది చాలా పొరపాటు. భారతదేశము బీదదేశము కానే కాదు. భారతదేశము మహా భాగ్యవంతమైన దేశము. ఇక్కడ ఎవ్వరూ భిక్షగాళ్ళు లేరు అనే దృఢ విశ్వాసముతో అందరూ మెలగాలి. 'భగవంతుడా! నాకు ఇది ప్రసాదించు, అది ప్రసాదించు', అని కోరికలు కోరుతూ, అవి తీరినప్పుడు 'నీవు గొప్పవాడవు, ఇలాంటి వాడవు, అలాంటివాడవు', అని భగవంతుని వర్ణిస్తూ భగవంతుని పొగిడేవారు ఎందరో ఉన్నారు. మీకు తెలుసు, ఏ దేవాలయమునకు వెళ్ళినప్పటికీ అక్కడ భిక్షగాళ్ళు చేరుతుంటారు. భగవంతుడు బీదవాడు కాడు. భగవంతుడు సృష్టించిన ప్రజలు ఎవ్వరూ బీదవారు కారు. కేవలము మానవులు తమంతట తామే కొందరిని బీదవారిగా భావించి భిక్షము పెట్టడము లేదా, నెట్టివేయడము ఇలాంటివన్నీ జరుగు తున్నాయి. కనుక, ఈ పిచ్చి అలవాట్లు క్రమక్రమేణ మానాలి. చాలామంది తిరుపతి వేంకటేశ్వర స్వామిని, 'మాకు అది ఇవ్వండి, ఇది ఇవ్వండి', అని అడగటం, ఆ కోరికలు తీర్చుకోవడానికి ముడుపులు చెల్లించుకోవడం ఈవిధంగా సాక్షాత్తు భగవంతుడినే భిక్షగాళ్ళ స్థాయికి దిగజార్చుతున్నారు. భగవంతుని మన స్వంత తండ్రిగా భావించాలి. దైవప్రీతి, మానవప్రీతిని పెంచుకోవాలి. తోటి మానవులను భిక్షగాళ్ళుగా భావించుకొని వారిని దగ్గరికి రానివ్వకపోవడం, ఛీకొట్టడం ఇలాంటి పనులు చేయకూడదు. కష్టాలలో ఉన్నవారిని, బాధలు పడుతున్నవారిని చూచి ప్రేమించండి, జాలి పడండి. మీరు దైవప్రీతిని, పాపభీతిని పెంచుకోవాలి. అతను ఏమీ చేతకానివాడని, ఏదో అడుక్కోవడానికి వచ్చాడని ఛీకొట్టి భిక్షగానిగా భావించకూడదు. మన ప్రవర్తనలో ఈవిధమైన మార్పులు మనం చేసుకుంటూ వచ్చినప్పుడే మనకు భగవంతుని అనుగ్రహం చిక్కుతుంది. తోటి మానవుడు మన సోదరుడేగాని, భిక్షగాడు కాదు. ప్రతి ఒక్కరినీ సోదర సోదరీమణులుగా భావించాలి. వాడు

sri sathyasai vachanamrutam

భిక్షగాడని, నీవు భిక్షం పెట్టేవాడవని నిన్ను నీవు అధికంగా భావించుకోవడం చాలా పొరపాటు. ఇంతే కాదు, కొంతమంది వ్యాపారస్థులు ఉంటారు. అధికారులకు లంచమిచ్చి తమ పనులు చేయించుకొంటారు. అధికారులు కూడా లంచం తీసికొని పనులు చేస్తుంటారు. ఇవి కూడా చాలా పాపకరమైన కర్మలే! ఒకవేళ ఎవరికైనా తినడానికి లేనప్పుడు కొంత తిండి పెట్టి కొంచెం ఆనందాన్ని కలిగించు. అంతేగాని, వానిని నీచంగా చూడవద్దు. ఏదో వారి బలహీనతతో, 'అయ్యా, అమ్మా, మాకు కొంచెం భిక్షం పెట్టండి', అని అడిగినంత మాత్రమున వాళ్ళు భిక్షగాళ్ళు కారు. నీవు ఇంత అన్నము పెట్టినంతమాత్రమున గొప్ప వాడవూ కాదు. వాని ఆకలికి పట్టెడన్నం పెట్టి పొట్ట నింపండి చాలు. భారతదేశము ఏనాటికీ బీదదేశము కాదు. నిజంగా భారతదేశము బీదదేశమే అయితే అనేక శతాబ్దాలుగా ఇన్ని పరాయి దేశములవారు మన దేశముపై ఎందుకు వచ్చి పడుతున్నారు? అనేక దేశములవారు భారతదేశముపై దండెత్తి దీనిని దోచుకొనిపోయారు. దీనిని బట్టి చూస్తే భారతదేశము శ్రీమంతమైన దేశమేగాని, బీదదేశము కాదు. తనంతట తాను భావించుకొని 'నేను బీదవాడిని కదా. నావలె ఉంటారు ప్రక్కవారు', అని పోల్చుకోవడం జరుగుతున్నది. ఎవరైనా, 'భవతి భిక్షాం దేహి' అని మీ దగ్గరికి వస్తే "భారతదేశముయొక్క కీర్తిని మనము నిలబెట్టాలంటే భిక్షము అడుగకూడదు. దేశము యొక్క గౌరవాన్ని మనం నిలబెట్టాలి", అని బోధించాలి.

**మాతృభూమి చాలా గొప్పది**

మొట్టమొదటగా భారతదేశము నా మాతృదేశమని సగర్వంగా చెప్పుకోగల్గాలి. మాతృదేశమును చక్కగా ప్రేమించాలి. నా భారతదేశము ఎంతో గొప్పది. అనేకమందికి శాస్త్రప్రమాణములు నేర్పి, వారిని ఎంతో గొప్పవారిగా చేసింది. వేదములు, శాస్త్రములు, ఉపనిషత్తులు, పురాణములు, భగవద్గీత మొదలైనవన్నీ ఇక్కడే ఆవిర్భవించాయి, అని గర్వంగా చెప్పుకోవాలి. ఇంతేకాదు. ప్రతి విషయంలోనూ మన భారతదేశమును గొప్పగా భావించి వర్ణించాలి. అప్పుడే మీరు భారతీయులు అని చెప్పుకోవ డానికి అర్హత ఉంటుంది. మరొక విషయముకూడా మీరు గుర్తుంచు కోవాలి. ఒకప్రక్కన నా దేశము గొప్పదని

srisathyasaivahamrutam

చెప్పుకుంటూ మీరు చిన్నవారుగా ప్రవర్తిస్తుంటే ఈ దేశము ఎట్లా గొప్పదౌతుంది.

పరమపావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి
ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మనదేశమందన్న
మాతృభావముకంటెను మాన్యమెద్ది?

'భారతదేశము నా తల్లి. నా తల్లి బీదదైతే నేను కూడా బీద వాడనే కదా!' అనే విషయము ఎల్లప్పుడు గుర్తు చేసుకోవాలి. 'నా తల్లి చాలా గొప్పది. నా దేశము మాతృదేశము. ఆ మాతృదేవిని గౌరవంగా కాపాడుకోవాలి. సకల శాస్త్ర పురాణములు అందరికీ నేర్పించి పెద్ద చేసినది ఈ భారతదేశము. కన్నతల్లి బీదగా ఉండవచ్చును. కాని, మాతృదేశము బీదది కాదు. మాతృభూమి చాలా గొప్పది. ఏ దేశము నందైనా భారతదేశము గొప్ప కీర్తిని పొందినటువంటిది. ఇటువంటి పవిత్రమైన మాతృదేశాన్ని చిన్నదిగా పోల్చుకొని దీనిని అవమాన పరచకూడదు', అని దృఢ నిర్ణయం చేసుకోవాలి. భారతదేశములోని నీతినిజాయితీలు ఇంకే దేశమునందూ కానరావు. భారతదేశమునకు మించిన దేశము ప్రపంచములో లేనే లేదు.

'భారతదేశమను బంగారు మనకుండ
వెండి బంగారుకై వెదుకనేల!'

బంగారువంటి భారతదేశాన్ని మనము ఈనాడు కించ పరుస్తున్నాము. ఈనాటి విద్యావంతులందరూ భారతదేశమును బంగారు దేశముగా తీర్చిదిద్దాలి. దురదృష్టవశాత్తు ఈనాడు గొప్ప గొప్ప చదువులు చదివినవారందరూ ఈ గొప్పతనాన్ని గ్రహించడం లేదు. భారతదేశము గొప్ప కీర్తి సంపాదించినది. ఈనాడు భారత దేశమందు చాలామంది అధికారులు లంచాలకు అలవాటు పడి తమ పరువు, ప్రతిష్ఠలను పోగొట్టుకుంటున్నారు. లంచాలు ఇవ్వడము, పుచ్చు కోవడము రెండూ చెడ్డవే! భారతదేశములో ఎవ్వరుకూడా

sri sathyasaivachanamrutam

ఈవిధమైన దురలవాటులో బడకూడదు. ప్రభుత్వము కూడా ఈ పరిస్థితిని పట్టుదలతో చక్కదిద్దడానికి కృషి చేయాలి. లంచమివ్వకూడదు, పుచ్చుకోకూడదు. మీ శక్తి సామర్థ్యములతో నీవు కార్యమును సాధించాలి. నీకంటే కొంచెం తక్కువగా ఉన్నవారిని ప్రేమించు.

**మాతృభూమియొక్క కీర్తిని నిలబెట్టడానికే మీరు పుట్టారు**

ఈనాడు ఏ దేవాలయమునకు పోయినా అక్కడి పూజారి భక్తుల ఎదుట ప్లేటు పెడతాడు. భక్తులు దానిలో ఇంత దక్షిణ వేసేది, ప్రసాదం తీసికొనేది. ఈ దక్షిణ మనకు వద్దు, భిక్షము మనకు వద్దు. ఎవరైనా ఆవిధంగా భిక్ష అడిగితే, చదువుకున్నవాళ్ళు వాళ్ళదగ్గరికి వెళ్ళి, 'నాయనా! నీవు భరతమాత పుత్రుడవు. ఆమె కుమారుడవైన నీవు ఈవిధంగా భిక్షమెత్తడం న్యాయం కాదు', అని బోధించండి. ఇంకా కొంతమంది భిక్షగాళ్ళకు దానం చేసే ఉద్దేశ్యంతో తమ జేబులోపల ఇన్ని కాసులు వేసుకొని బయటకు వస్తుంటారు. ఇది మంచిపని కాదు. ఏదో బిచ్చమడిగినారు కదా, అని అడిగినవారికి కొన్ని చిల్లర నాణెములు దానము చేసి సంతోషించడం గొప్పతనము కాదు. ఆ భిక్షగాడు నీవద్ద నుండి కొన్ని కాసులు భిక్షంగా తీసుకున్నాడు, కాని తల్లియొక్క కీర్తిని ఎంత పోగొట్టుతున్నాడు! కనుక, నీవు తల్లియొక్క గౌరవాన్ని కాపాడాలి. నీ మాతృభూమియొక్క కీర్తిని నిలబెట్టడానికి వచ్చావు. తల్లి పేరు నిలబెట్టలేనివాడు పుట్టి ప్రయోజనమేమిటి? కనుక, తల్లిపేరు నిలబెట్టడానికి ప్రయత్నం చేయాలి. మా పిల్లలు అప్పుడప్పుడు రామాయణ గాథను గానం చేస్తుంటారు. అందులో లవకుశులు తమ తల్లియైన సీత దుఃఖములో మునిగి ఉండడం చూసి, 'అమ్మా! ఎందుకు కంటిధారలు కారుస్తున్నావు? మేము కేవలం పరాధీనులుగా ఉంటున్నామని భావిస్తున్నావా? కాదు, కాదు. రాములకంటే మించినవారము మేము. నీవు కంటి ధారలు కారిస్తే దేశసౌభాగ్యమే నశించిపోతుంది. నీవు కన్నీరు కార్చకూడదు. మేమున్నాము. ప్రాణాలనైనా ఒడ్డి, నిన్ను కాపాడతాము. కనుక, కంటిధారలు కార్చవద్దు', అని చెప్పారు. ఈవిధమైన పుత్రులు ఈనాడు చాలా తక్కువైపోయారు. ఎక్కడ చూసినా బలహీనత! బలహీనత!

sri sathyasai vachanamrutam

## తేదీ 23.10.2004 శ్రీవారి దివ్యబోధ

నేను ఒక్కొక్క సమయంలో అనుకుంటాను, 'మన భారతీయులే ఈవిధంగా భిక్షగాళ్ళను తయారు చేస్తున్నారు. భారతీయులు ఎంతో గొప్పవారై ఉండికూడా ఇంత నీచపుబుద్ధిని ఎందుకు పెంచుకుంటున్నారు? 'నాదగ్గర లేదు', అనే భావము నీ నుండి రాకూడదు. మీకు తెలుసు. షిరిడీ అవతారంలో ఒకసారి ఒక ధనవంతుడు బాబా దగ్గరకు వచ్చి, తనకు అర్జంటుగా బ్రహ్మ జ్ఞానము ఉపదేశించుమని, అందుకొరకు తాను రానూ, పోనూ టాంగా కట్టించుకొని వచ్చానని, త్వరగా బాబా బ్రహ్మజ్ఞానముపదేశిస్తే, తాను వెళ్ళిపోతానని తొందర చేస్తాడు. అప్పుడు బాబా అతనిని కూర్చుండ జేసి ఒక భక్తుని పిలచి, ఫలానా వర్తకునివద్దకు వెళ్ళి ఐదు రూపాయలు తీసుకు రమ్మని పంపించాడు. ఈ భక్తుడు అక్కడికి పోతే, ఆ వర్తకుడు ఇంటికి తాళం వేసుకొని ఎక్కడికో పోయాడు. అప్పుడు బాబా ఇంకొక వర్తకుని ఇంటికి పంపించి డబ్బు తెమ్మన్నాడు. ఆయన కూడా ఇంట్లో లేడు. ఇంకొక ఇంటికి పోయాడు. ఈవిధంగా, వారెవ్వరూ అక్కడ లేకుండా పోయారు. ఇంత జరుగుతున్నా తన ప్రక్కనే కూర్చుని ఈ పరిస్థితినంతా గమనిస్తున్న ధనవంతుడు మాత్రం తన జేబులో నిండుగా ఉన్న నోట్లకట్టలోనుండి ఒక్క నోటు కూడా తీసివ్వలేదు. అప్పుడు బాబా అతనివైపు చూచి, 'నాకు ఐదు రూపాయలు కావాలంటే, ఈ భక్తుడు ఎక్కడకు పోయినా లేకుండా పోయిందే! అయ్యా, జేబు నిండుకు డబ్బు పెట్టుకున్నావు. ఇంతసేపటినుండి నీ కళ్ళ ఎదుటే అనేకమంది ఇళ్ళకు నేను వీనిని డబ్బుకోసం పంపడం, వీడు వట్టి చేతులతో తిరిగి రావడం నీవు చూస్తూనే ఉన్నావు. అయినా, నోట్లకట్టతో నిండి ఉన్న నీ జేబులోనుండి ఒక్క ఐదు రూపాయల నోటు కూడా నీవు తీసివ్వలేదు. ఐదు రూపాయలు త్యాగము చేయలేని నీకు బ్రహ్మజ్ఞానము ఏరీతిగా అలవడుతుంది?' అని బాబా ఆ వ్యాపారిని మందలించారు. ఈనాడు భిక్షగాళ్ళకు బలవంతముతో భిక్షము ఇస్తున్నారుగాని, ప్రేమతో అందించడం లేదు. మనము ఏ పని చేసినా ప్రేమతో చేయాలి. 'భవతి భిక్షాం దేహి' అని ఎవరైనా వచ్చి అడిగితే, వారిని ఆదరించి, అన్నము పెట్టాలి. ఈ ప్రపంచములో ఉన్న సంపదలో అందరికీ Equal share ఉన్నది. అంతేగాని, నీవు గొప్పవాడవని, వానికి లేదని చెప్పడానికి వీల్లేదు. ఈరకమైన చిల్లర బుద్ధులు మనం మానుకోవాలి. త్యాగభావము మనలో పెంపొందాలి. ఈ త్యాగము నేర్చుకున్నవాడే

sri sathyasai vachanamrutam

గొప్పవాడుగా తయారౌతాడు. ఇటువంటి త్యాగభావము ఈనాడు ఏ మానవునియందూ కనబడడం లేదు. ఎక్కడ చూసినా, ప్రజలు త్యాగము గురించి, గొప్పగా ఉపన్యాసాలు ఇస్తున్నారేగాని, తమ జేబులోనుండి ఒక్క పైసా కూడా తీయడం లేదు. ఇలాంటివి చేసి ప్రయోజనమేమిటి? 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం' అన్నారు. ఆవిధంగా, జీవించిన వాడే నిజమైన మానవుడు. మన దేశగౌరవాన్ని మీరు కాపాడుతూ రావాలి. ఈనాడు భారతదేశ గౌరవము చాలావరకు తగ్గిపోయింది. ఈవిధముగా, భిక్షగాళ్ళను తయారు చేసినది ఎవరు? చదువుకున్న వారే! ఇదేనా చదువుకోవడమంటే? ఇట్టి చదువు మనకు అక్కర్లేదు.

**ఎమ్మేలు బియ్యేలు ఏర్పడ చదివియు**
**పేరు గాంచిన పెద్దవారలైన**
**సంపదలుండియు సద్దానపరులైన**
**పుడమి కీర్తిని గన్న పుణ్యులైన**
**సతతంబు జపములు తపములు చేయుచు**
**వేదంబులను నేర్చు విప్రులైన**
**ఆయురారోగ్యంబు లనవరతంబుండి**
**పరిపూర్ణ బలులగు వారలైన**
**సాటిరారు భక్తులకు ఏనాటికైన**

ఈనాడు విద్యావంతులైనవారియందు అట్టి పరిపూర్ణమైన బలము కనిపించడం లేదు. వారు చాలా బలహీనులైపోతున్నారు. దేశము యొక్క గౌరవాన్ని, మాతృభావమును చాలా పాడు చేస్తున్నారు. తల్లి గౌరవాన్ని నిలపాలి. రామకృష్ణ పరమహంస రవీంద్ర నాథ టాగూర్, వివేకానంద మొదలగు మహనీయుల చరిత్రలను చదివితే వారందరూ ఉన్నతమైన భావములు కలిగియుండాలని ప్రజలను ఉద్బోధించిన వారే! కనుక, ప్రతి ఒక్కరూ 'నేనెవరు? నేను భరతమాత పుత్రుడను', అని సగర్వంగా చెప్పుకోగల్గాలి. ఇప్పుడొక అబ్బాయి మాట్లాడాడు, 'నేను భరతపుత్రుడను' అని. ఆవిధంగా, భరత పుత్రుడు అనే

sri sathyasaivachanamrutam

పేరును నిలబెట్టాలనుకుంటే ప్రతి ఒక్కరూ త్యాగమునకు పూనుకోవాలి. 'నాకు లేకపోయినా ఫరవాలేదు. ఇతరులకు కొంచెం పెట్టాలి', అనే భావమును పెంపొందించుకోవాలి. నిజమైన త్యాగభావము రావాలి.

**భరతుని త్యాగభావము సాటిలేనిది**

శ్రీమద్రామాయణములో భరతుడు చూపిన త్యాగభావము సాటి లేనిది. పితృవాక్యపరిపాలనకై రాముడు అడవికి వెళ్ళినప్పుడు తల్లియైన కైకేయి కోరిక ప్రకారము భరతునికి పట్టాభిషేకము జరుగవలసి ఉండినది. అయినప్పటికీ అతడు అన్నయైన రామునికే రాజ్య పట్టాభిషేకము జరుగవలెనని, అది ధర్మమని భావించి రాముని అయోధ్యకు రమ్మని ప్రార్థించడానికి తన తల్లులతో, పరివారముతో అడవులకు వెళ్ళాడు. అల్లంత దూరములో సైన్య, పరివార సమేతంగా వస్తున్న భరతుని చూచి, లక్ష్మణునికి చాలా కోపం వచ్చింది. 'భరతుని తల్లి మనలను అడవులకు పంపితే ఆమె కుమారుడు వచ్చి ఆ అడవుల్లో కూడా నివసించడానికి వీల్లేకుండా చేయాలని వస్తున్నాడు. ఇది నేను సహించను. భరతుని చంపివేస్తా', అని కోపంతో ఊగిపోయాడు. అప్పుడు రాముడు అతనిని సమాధానపరుస్తూ, 'నాయనా! లక్ష్మణా! నీకు రాజ్యంపై ఆశ వచ్చిందా ఏమిటి? నీకు కావలిస్తే పోయి రాజ్యమునేలు. నీవు భావించినట్లుగా భరతుడు మనపై దండెత్తి రావడం లేదు. భరతుడు గొప్ప త్యాగమయుడు, శీలమయుడు. అతని వద్ద ఉన్న త్యాగబుద్ధి మరెవ్వరివద్ద లేదు. కడపటికి తల్లి తనకు పట్టాభిషేకము జరగాలని కోరినా కుమారుడు దానిని ఖండిస్తూ వచ్చాడు. భరతుడు చాలా గుణవంతుడు', అని నచ్చజెప్పాడు.

భరతుడు అరణ్యమునకు వచ్చినప్పుడు రాముడు తక్షణమే, 'నాయనా భరతా! అమ్మా నాన్నా బాగున్నారా?' అని అడిగాడు. తన తల్లి కౌసల్య బాగుందా, అని మాత్రం అడగలేదు. కైక బాగుందా? అని పినతల్లి యైన కైక క్షేమమును గురించి ప్రశ్నించాడు. కైక పేరు చెప్పేటప్పటికి భరతునికి పట్టరాని కోపం వచ్చింది. 'ఆ దుర్మార్గురాలి వల్లనే నీవు అరణ్యముల పాలైనావు. ఛీ, ఆ పేరే నావద్ద చెప్పకు', అని బాధ పడ్డాడు. అప్పుడు భరతుని దగ్గరకు పిలచి రాముడు, 'భరతా! నీ తల్లి చాలా గొప్పది. రాముని సత్కీర్తిని జగత్తుకు వ్యాప్తి

sri sathyasai vachanamrutam

చేసినది నీ తల్లియే! కనుక, బాహ్యమైన భావములచేత ఆమెను తూలనాడకు. ఆమెలో అంతర్భూతమైన భావాలు చాలా గొప్పవి', అని అందరినీ నెట్టుకొని కైక ఉండే చోటుకి వెళ్ళాడు. ఆమె పాదములకు నమస్కారము చేసి, 'తల్లీ! నీవల్ల నేను క్షేమముగా ఉన్నాను. భరతునికి పట్టాభిషేకము చేసి రాజ్యమును ఏలించు. అతనికి నీతివాక్యములు బోధించు. పధ్నాల్గు సంవత్సరములు అరణ్యవాసము పూర్తి చేసుకొని నేను వచ్చిన తరువాత నా భరతుని నేను చూసుకుంటాను. పితృవాక్యపరిపాలన జరపాలి కదా! అంతేకాదు. రాజ్యపరిపాలన సక్రమంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా జరగాలి. ఈవిధంగా తండ్రి ఆజ్ఞను శిరసావహించినప్పుడే మనము ఫలానా దశరథమహారాజు పుత్రుల మని పేరు తెచ్చుకున్నవారమవుతాము', అని కైకకు, ఆమె కుమారునికి కర్తవ్య బోధ చేశాడు రాముడు. ఈవిధంగా, మాతా పితరుల ఆజ్ఞను పాలించడంతోపాటు ప్రజాక్షేమము, వారి సుఖ సంతోషాలను కూడా చూడాలి అనే విషయాన్ని కూడా బోధించాడు రాముడు. మనం ప్రజల క్షేమాన్ని కూడా ఆశించాలి. 'ప్రజలయొక్క ఆనందాన్ని కూడా ఆశించాలి. అప్పుడే మనం నిజమైన పాలకులుగా తయారౌతాం', అని నొక్కి చెప్పాడు రాముడు. రాముడు బోధించిన ఈ నీతివాక్యాలు లక్ష్మణుని మనస్సులో దృఢంగా నాటుకున్నాయి. అప్పుడు లక్ష్మణుడు రామునివద్దకు చేరి, 'నీవు బోధించిన నీతి వాక్యములు నా మనస్సులో నిల్చుకున్నాయి. మొదట్లో భరతుని, అతని సైన్యాన్ని చూసినప్పుడు నా గుండె మండిపోయింది', అని పశ్చాత్తాపం చెందాడు. రాముడు మళ్ళీ, 'లక్ష్మణా! నీవు బాహ్యమైనవాటిని చూసి బాధపడుతున్నావు. ఇది సరికాదు. అంతర్ముఖమైన ఆనందమునందుకోవడానికి ప్రయత్నించు', అని సలహా ఇచ్చాడు. ఇంతలో భరతుడు రామునివద్దకు వచ్చి, అయోధ్యకు తిరిగి రమ్మని మరోసారి వేడుకున్నాడు. అప్పుడు రాముడు భరతుని దగ్గరకు చేర్చుకొని, 'భరతా! నీవు చేసినవన్నీ చాలా గొప్పవే. కాని, తండ్రి ఆజ్ఞను నీవు ఉల్లంఘిస్తున్నావు. తల్లి ఆజ్ఞను శిరసావహించు. తండ్రి ఆజ్ఞను శిరసావహించు. వారిరువురినీ ఆనందపెడితే నేను తప్పక ఆనందిస్తాను. ప్రజారంజకంగా పరిపాలన చేయగల సమర్థుడవు నీవుండగా నేను ఎందుకు బాధపడడం? నేను మాత్రమే రాజు కావాలనుకుంటే, అది స్వార్థమౌతుంది. ప్రజా పరిపాలనలో స్వార్థమును,

sri satyasai vachanamrutam

బంధుప్రీతిని తీసివేయి. త్యాగము చేసినప్పుడే భోగము లభిస్తుంది', అని బోధించాడు. వెంట పోయిన వశిష్ఠుడు రాముని ధర్మబోధను విని, ఆనందబాష్పములు రాల్చాడు. కనుక, మీరు ఎల్లప్పుడు ప్రేమతో మాట్లాడాలి. ప్రజలయొక్క బాధను కొంతవరకు తగ్గించడానికి ప్రయత్నించాలి. తోటి మానవులను ప్రేమతో చూసి అందరినీ తనవలె భావించుకోవడమే నిజమైన ధర్మము. ధర్మమనగా కేవలం దానధర్మములు చేయడం మాత్రమే కాదు. హృదయముతో త్యాగము చేయాలి. అందరినీ ప్రేమించి దగ్గరకు చేర్చుకోవాలి. వారెవరో పరాయివారని భావించకూడదు. ఈ ప్రేమ ఒక్కటి ఉంటుంటే, ఎందరినైనా సాకవచ్చును. కనుక, మనం నేర్చుకోవలసినది, మనం పెంచుకోవలసినది ప్రేమయే! తల్లీ, తండ్రీ, దైవమును ప్రేమించాలి. తల్లి బాధపడుతుంటే, పరులను ఎంత ప్రేమించి ప్రయోజనమేమిటి? కనుక, మొట్టమొదట కన్నతల్లిని, తండ్రిని ప్రేమించు. తరువాత ప్రజలను ప్రేమించు. రాముడు భరతునికి ఉపదేశించినది ఇదే.

**త్యాగమే నిజమైన భోగము**

విద్యార్థులారా! రేపటి నుండి సాధ్యమైనంత వరకు ఎవ్వరినీ చిన్న భావముతో చూడకండి. విశాలభావముతో చూడండి. 'అందరూ నావంటివారే! సోదరా! మనం కలసి భోజనం చేస్తాం, రండి', అని ప్రక్కనున్నవారిని పిలవాలి. ఒంటరిగా భోజనం చేయకూడదు. ఎవరినీ బీదవాడనిగాని, భిక్షగాడనిగాని భావించరాదు. అందరూ ధనవంతులే! ఎవ్వరూ బీదవారు కావడానికి వీల్లేదు. మన భావములు బీదగా మారిపోతున్నాయేగాని, వారిలో బీదతనమనేది ఎప్పుడూ లేదు. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు విశాల హృదయులు. అటువంటివారింటికి తాను కోడలిగా వచ్చినానని సీత ఆనందించింది. తన తండ్రియైన జనకమహారాజు సీతాస్వయంవరం ప్రకటించి, శివధనుస్సును ఎక్కుపెట్టినవారికి సీతనిచ్చి వివాహము చేస్తానని చెప్పినప్పుడు రాముడు అవలీలగా శివధనుస్సును ఎక్కుపెట్టాడు. అంతేకాదు. శ్రీరామచంద్రుడు శివధనుస్సునే కాదు, అటువంటి పది ధనుస్సులనైనా ఎత్తగల శక్తిగలవాడు. ఎందువలనంటే, రాముడు ధర్మమూర్తి. ధర్మమే అన్నివిధాలా పవిత్రమైనది, శక్తిమంతమైనది. ఈ

రామలక్ష్మణభరతశత్రుఘ్నులు ఒకే ఫలములోని తొనలవంటివారు. ఒకానొక సమయంలో సుమిత్ర ఒక నారింజ పండు వలుస్తూ, ఒక్కొక్క తొనతీసి, 'ఇది రాముడు, ఇది లక్ష్మణుడు, ఇది భరతుడు, ఇది శత్రుఘ్నుడు, ఈమె సీత', అని పేర్లు పెట్టి ఆనందించేది. ఇలాంటి పవిత్రమైన, విశాలమైన భావములు కలిగిన కోడళ్ళు తమకు చిక్కారు గదా అని ఆమె చాలా ఆనందించింది. ఆ వచ్చిన కోడళ్ళు కూడా అత్తలను చాలా గౌరవించారు. కుమారులు కూడా తమ తల్లులను చాలా ప్రేమగా చూసుకున్నారు. రామలక్ష్మణభరతశత్రుఘ్నులు నల్గురూ ఒకేమాటపై ఉండేవారు. వారి భార్యలు కూడా అంతే! అందు వలననే, రాముడు పరిపాలించిన రాజ్యమునకు, 'రామరాజ్య' మనే పేరు సార్థకమైనది. కనుక, ఈ భరతదేశమునందు పుట్టిన మీరు నిజమైన భారతీయులుగా 'తీయ'గా ఉండాలి. ఏ ఒక్క విషయమందూ ఎవ్వరినీ చిన్నచూపు చూడకూడదు. మనం భోజనం చేసే ముందు ఎవ్వరైనా భిక్షగాళ్ళు మన ఇంటికి వస్తారేమోనని కాచుకొని ఉండి వాళ్ళకి పెట్టాలి. ఈరకమైన త్యాగభావము మీలో ఉండినప్పుడే మీకు నిజమైన భోగము కలుగుతుంది.

విద్యార్థులారా! పవిత్రమైన ఈ భారతదేశమందు మనం జరుపుకునే పండుగలను పవిత్రమైన దినములుగా భావించుకోవాలి. ఈరోజు విజయదశమి. మన జీవితంలో ప్రతి రోజూ ఇటువంటి పర్వదినములా జరగాలని ఆశిస్తూ అందరూ కలసి మెలసి మెలగాలి.

**కలసి మెలసి పెరుగుదాం కలసి మెలసి తిరుగుదాం**
**కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసి మెలసి కలతలేక చెలిమితో జీవించుదాం**

మీరందరూ కలసిమెలసి మెలగాలి. తల్లిదండ్రులకు ఆనందము నందించాలి. తల్లిని చాలా ప్రేమతో పూజించాలి. ఆవిధంగా మీరు ఉంటుంటే, దేశం నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా వర్ధిల్లుతుంది. ఈ విజయదశమి రోజున ఈ విషయాలన్నీ మీరు నేర్చుకొని రేపటి నుండి ఆచరణలో పెట్టి అందరికీ ఆదర్శప్రాయులు కావాలి. అందరి ముఖములూ నవ్వులతో, తేజస్సుతో ఉండాలి. ఎవ్వరి ముఖమూ Castroil face గా పెట్టుకోకూడదు. మా పిల్లలు ఎప్పుడూ అలా పెట్టుకోరు. నాకు తెలుసు. Love All, Serve All**శ్రీవారి దివ్యబోధ**

**తేదీ 23.10.2004**

srisathyasaivachanamrutam